క్లుప్తంగా

షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలి



తనిఖీ చేస్తున్న డీఈవో జనార్దన్‌రావు

చిగురుమామిడి: షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని డీఈవో ఎస్. జనార్దన్‌రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం చిగురుమామిడి జెడ్పీపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. పాఠశాలకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులు, వెనుకబడిన విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. రోజు అసైన్‌మెంట్ నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతి నివేదికల పురోగతిని సమీక్షించాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం మునిగంటి శోభారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సైకి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

వీణవంక: వీణవంక మండల పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై ఆసీఫ్‌ను జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పెద్ది మల్లారెడ్డి, సర్పంచ్ ఎనగంటి విజయశ్రీనివాస్, ఎండీ అఖిల్‌పాషా, స్వామి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.

17న యాదవ సంఘం సమావేశం



మాట్లాడుతున్న జంపయ్య

శంకరపట్నం: శంకరపట్నం మండల యాదవ సంఘం సమావేశం 17న నిర్వహించనున్నామని మండల అధ్యక్షుడు కనవేని జంపయ్య తెలిపారు. యాదవుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులపై సమావేశంలో చర్చించనున్నామని, మండలంలోని యాదవులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో శ్రీనివాస్, కుమార్‌యాదవ్, పాల్గొన్నారు.

ఆడబిడ్డకు అండగా..



డిపాజిట్ పత్రం అందిస్తున్న లచ్చయ్య

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన టీఎల్ యువసేన నాయకుడు తూడి లచ్చన్న నిరుపేద కుటుంబాలు, ఆపదలో ఉన్నవారికి, ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆడపిల్లలకు అండగా నిలవడానికి ఆడపిల్ల బంగారు తల్లి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మల్లాపూర్ గ్రామంలో జన్మించిన ప్రతి అమ్మాయి పేరు మీద సుకన్య యోజన ఖాతా తీసి రూ.ఐదువేలు జమ చేస్తామన్నారు. మొదటిసారి గ్రామానికి చెందిన శివ,పరమేశ్వరి దంపతుల కూతురు పేరు మీద నగదు జమచేసి బుధవారం ఖాతా బుక్ అందజేశారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం నిల్వలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

హుజూరాబాద్: రైస్‌మిల్లులలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ చైర్మన్, సంబంధిత అధికారులు నాలుగు రైస్ మిల్లులపై తనిఖీలు నిర్వహించి తూతూ మంత్రంగా విచారణ చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. బాధ్యతగా వ్యవహరిస్తే ఎలాంటి అక్రమాలు జరిగే అవకాశం ఉండదని, దొడ్డిదారిన కొందరు రైస్‌మిల్లుల యజమానులు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అవే రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి అంటగడుతున్నారని, ఇప్పటికైనా రైస్‌మిల్లుల వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, జోన్ కమిటీ సభ్యులు గుండేటి వాసుదేవ్, కదిరే రమేశ్ పాల్గొన్నారు.

మూలమలుపులు మృత్యులోగిళ్లు

- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం
- హెచ్చరిక, సూచిక బోర్డులు కరువు
- ప్రమాదాలపై పలుమార్లు ఫిర్యాదు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నవాబుపేట్ గ్రామశివారులో ప్రమాదకర మూలమలుపు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల మధ్యలో అక్కడక్కడ ఉన్న మూలమలుపులతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలు, చెట్ల కొమ్మలు రోడ్డును కమ్మేస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోవడంతోపాటు పలువురు గాయాలపాలైన సందర్భాలు ఉన్నా యి. రోడ్లను కమ్మేస్తున్న చెట్ల కొమ్మలు, ముళ్లపొదలను తొలగించడంపై ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెలువడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టులు, మూలమలుపుల వద్ద హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- మండలంలోని నవాబుపేట్‌లో ఏడాది వ్యవధిలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.
- గ్రామ శివారులోని మూలమలుపు వద్ద రెండు బైక్‌లు వేగంగా ఢీకొనగా బత్తిని రామస్వామి అనే వ్యక్తి మృతి చెందారు.
- నవాబుపేట్–సుందరగిరి గ్రామాల మధ్య ఉన్న మరో మూలమలుపు వద్ద బైక్‌పై వెళ్తున్న ఎర్రోజు సామ్రాజ్యం అనే వ్యక్తిని మూలమలుపు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. ప్రమాదాలకు మూలమలుపులే ప్రధాన కారణం.
- నవాబుపేట్ నుంచి సుందరగిరి వరకు దాదాపు పది మూల మలుపులున్నాయి. మలుపుల వద్ద వాహనం దగ్గరికి వచ్చేంత వరకు తెలియడం లేదు.
- నాలుగేళ్లలో దాదాపు పదికి పైగారోడ్డు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరికీ కాళ్లు, చేతులు విరిగిపోగా మరికొందరు మంచానికే పరిమితమయ్యారు.
- మండలంలోని బొమ్మనపల్లి–సుందరగిరి–దుద్దెనపల్లి గ్రామాల మధ్య ప్రమాదకర మలుపులున్నాయి.
- బొమ్మనపల్లి సుందరగిరి గ్రామాల మధ్య రోడ్డు పక్కనే వ్యవసాయబావి ఉంది. దానికి తోడు చెట్లు పెరిగి వ్యవసాయబావి కనిపించకుండా ఉంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.
- హుస్నాబాద్–కరీంనగర్ ప్రధాన రహదారి కొండాపూర్ గ్రామానికి సమీపంలోని మూలమలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- మూడు నెలల క్రితం ఇద్దరు యువకులు లారీ ఢీకొని మృతి చెందారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలేదు.
- చిగురుమామిడి–సీతారాంపూర్ గ్రామాల మధ్య ఉన్న మూలమలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- చెట్లు, ముళ్లపొదలు తొలగిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



ఆయా గ్రామాలకు వెళ్లే దారుల మధ్యలో చాలా మూలమలుపులున్నాయి. చెట్లు, ముళ్లపొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చెట్లు, ముళ్లపొదలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– శ్రీమూర్తి రమేశ్, సర్పంచ్, సుందరగిరి

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



బొమ్మనపల్లి–దుద్దెనపల్లి గ్రామాల మధ్య రోడ్డును ఆనుకొని నాలుగు వ్యవసాయబావులున్నాయి. ప్రమాదాల నుంచి రక్షణ కల్పించేందుకు రెండింటికి సరైన రక్షణ గోడలు లేవు. ఆర్‌అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మలుపుల వద్ద సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– కానుగంటి భూంరెడ్డి, సర్పంచ్, బొమ్మనపల్లి

చర్యలు తీసుకుంటాం



ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల మధ్యలోని మూలమలుపుల వద్ద, రహదారులను కమ్మేస్తున్న చెట్లు, ముళ్లపొదలను తొలగించే అంశం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఈజీఎస్‌లో కూలీలతో తొలగిస్తాం. సంబంధిత అధికారులు మూలమలుపుల వద్ద సూచిక, హెచ్చరికల బోర్డుల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం. నర్సయ్య, ఎంపీడీవో, చిగురుమామిడి

నియామకం

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా తిరుపతి

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి, సాంబయ్యపల్లి గ్రామాల ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా సందెవేణి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, డీసీవో జి. కావ్య తెలిపారు. ఉపాధ్యక్షుడిగా రేషవేని ఐలయ్య, కార్యదర్శిగా ఆవుల ఐలయ్య, డైరెక్టర్లుగా వేల్పుల నర్సయ్య, వేల్పుల రాములు, ఆవుల కొమురయ్య, సందవేణి నర్సయ్యలు ఎన్నికయ్యారు. ఎంపీటీసీ కట్టికోల తార, ఉప సర్పంచ్‌లు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కాలువ రమ్య పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఫోరం గంగాధర మండల అధ్యక్షుడిగా లచ్చయ్య



నూతన అధ్యక్షుడితో ఎంపీటీసీలు

గంగాధర: గంగాధర మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడిగా ఆచంపల్లి ఎంపీటీసీ కోలపురం లచ్చయ్యను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సమావేశమైన 11 మంది ఎంపీటీసీలు గత అధ్యక్షుడు ర్యాలపల్లి ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డిని తొలగిస్తూ లచ్చయ్యను ఎన్నుకుంటూ ఏకగ్రీవ తీర్మానం చేశామని ఎంపీటీసీలు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సైదాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంట సీపీఐ జిల్లా సభ్యుడు బత్తుల బాబు, అశోక్, కొమురయ్య, జితేందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం నాగరాజు

వీణవంక: జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. వెంట కాంగ్రెస్ నాయకులు గంగాడి రాజిరెడ్డి, కర్ర భగవాన్‌రెడ్డి, సందీప్‌తో పాటు జీపీ కార్మికులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై ప్రభుత్వానికి చిన్నచూపు

మానకొండూర్‌రూరల్: జీపీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ఆరోపించారు. మండల కేంద్రంలో జీపీ కార్మికులు వారం రోజులుగా చేస్తున్న సమ్మెకు బుధవారం మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, ఉద్యోగ భద్రతను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లాకార్యదర్శి రంగు భాస్కరాచారి, ప్రభాకర్, లక్ష్మణాచారి, రమేశ్, ప్రదీప్, వరప్రసాద్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



జమ్మికుంట: బోనాలతో తరలివెళ్తున్న చాకలి కులస్తులు

చొప్పదండి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు ఇంటికో బోనం చొప్పున భారీ ర్యాలీతో కాలనీ శివారులోని ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం, మొక్కులు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

మడిపల్లి గ్రామంలో మడేలయ్య..

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో బుధవారం మడేలయ్య బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చాకలి కులస్తులు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయాలని చేరుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామ కుల సంఘం అధ్యక్షుడు మచ్చర్ల కొంరయ్య మాట్లాడుతూ.. మూడేళ్ల కోసారి మడేలయ్యకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పైతరి బద్రి, సభ్యులు మచ్చర్ల లింగారాజు, గోపరాజు తిరుపతి, పైత్రరి మల్లయ్య, గోపరాజు శంకర్, కుల పెద్దలు మచ్చర్ల సుధాకర్, పైతరి రవి పాల్గొన్నారు.



చొప్పదండి: బోనాలతో వెళ్తున్న మహిళలు

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేశారు. వంకాయగూడెం గ్రామంలో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. మహిళల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేస్తుందన్నారు. జీపీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ రమేశ్, సర్పంచ్‌లు ముంజ వసంత, గుర్రం లత, సంజీవరెడ్డి,కొండ్ర రాజయ్య, విండ చైర్మన్ సంజీవరెడ్డి , ఉపసర్పంచ మడ్డి రవి, ఎంపీటీసీ తిరుపతయ్య, ఆలయ చైర్మన్ మలహాల్‌రావు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



జమ్మికుంట: మాట్లాడుతున్న నాయకులు



హుజూరాబాద్‌లో...

జమ్మికుంట: పట్టణం, మండలంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం 2020 రద్దు చేసి పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టాలన్నారు. ప్రైవేటు స్కూల్, కాలేజీల్లో ఫీజుల నియంత్రణ చట్టం రూపకల్పన అమలుచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఠాకూర్, ప్రణయ్, రవి, దేవేందర్, శివ, అరవింత్, సతీష్, రోహిత్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ పిలుపు మేరకు ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ బాధ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల అనిల్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కోశాధికారి రవితేజ, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యుడు అభిషేక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, చందు, రోహిత్, అనుదీప్,ఎస్ఎఫ్ఐ నాయకులు నితిన్,బాబు, మహేష్,తదితరులు ఉన్నారు.

పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం



మానకొండూర్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల ధర్నా

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్ మానకొండూర్ నియోజకవర్గాలతోపాటు హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో బుధవారం సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్ష్యుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా దహనం చేశారు. శవయాత్ర, పిండ ప్రదానం, ధర్నా, ర్యాలీలు నిర్వహించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు, రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్య క్రమాల్లో రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నీరజ

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కీం ఫర్ అడల్ట్, అండ్ గరల్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని పదో వార్డు పరిధిలో ఎస్ఈజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ జి. సునందతో కలిసి బుధవారం ప్రారంభించారు. మహిళలు కుట్టుశిక్షణ, మగ్గంవర్క్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొత్తూరి స్వతంత్ర భారతి, ఇన్‌స్ట్రక్టర్ కట్ల శ్రీలత, కొత్తూరి నరేశ్, కట్ల రమేశ్, మల్లేశం, రాజయ్య, తిరుపతి, సహస్ర, సుప్రయ, సాయిప్రియ, మేఘన, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో ఆయుర్వేద వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లె గ్రామంలో బుధవారం గన్నేరువరం ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ భవానిప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వర్షాకాలంలో ఇంటి ఆవరణలో మురికినీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దగ్గు, జలుబు, బీపీ, మధుమేహంతో పాటు అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, ఆయుర్వేద వైద్యశాల సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమలత, అజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును పరిశీలించిన తహసీల్దార్



చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో తహసీల్దార్ జింక జయంత్ బుధవారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్‌వోలతో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. ఓటరు నమోదును పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు పూర్తి చేయాలన్నారు. వెంట రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.

బీసీలకు 70 సీట్లు కేటాయించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న బొల్లం లింగమూర్తి

మానకొండూర్: అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి డిమాండ్ చేశారు. మానకొండూర్‌లోని పద్మావతి కళ్యాణ మండపంలో వివిధ మండల కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా ప్రతిపదికన అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని, ఏళ్లు గడుస్తున్నా కులగణన చేయకపోవడంపై మండిపడ్డారు. బీసీల కులగణన చేస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ హామీ మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ అజయ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అశ్విన్, రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, గరిక కోటేశ్వర్, గాండ్ల శ్రీనివాస్, రాంపర్తి వికాశ్, పల్లె దేవేందర్, తీర్థాల కుమార్, మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం, మండల అధ్యక్షులు ముక్కెర సతీష్, మర్రి అనిల్‌యాదవ్, తాటికంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



హుజూరాబాద్: పట్టణానికి చెందిన ధర్మపురి నారాయణస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం తపాల ప్రమాద బీమా చెక్కును పోస్టల్ అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. తపాలశాఖలో ఇటీవల నారాయణస్వామి బీమా తీసుకున్నారని మరణానంతరం ప్రమాద బీమా పథకం నుంచి రూ.10 లక్షలు వచ్చాయని తెలిపారు. చెక్కును పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్, మున్సిపల్ చెర్మన్ గందె రాధిక శ్రీనివాస్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులు అందుకున్నారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంతరామ్ నాయక్, పోస్టు మాస్టర్ ఉకంటి మహేందర్, ఐపీపీబీ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.